క్లుప్తంగా

ఓటరు చైతన్యంపై కళాజాతా



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

టేకులపల్లి: కలెక్టర్ ప్రియాంక ఆదేశాల మేరకు డీపీఆర్‌ఓ శ్రీనివాస్ పర్యవేక్షణలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు సోమవారం టేకులపల్లి మండల కేంద్రంలో ఓటరు చైతన్యంపై కళాజాతా నిర్వహించారు. ప్రజలు ప్రలోభాలకు లోనుకాకుండా నిజాయితీగా ఓటు వేయాలని, ప్రతీఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆటపాటల ద్వారా తెలియజేశారు. వంద శాతం ఓటు వినియోగం జరిగేందుకు ప్రతీఒక్కరు కృషి చేయాలని కోరారు. లంకపల్లి కిరణ్, కళాకారులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



తనిఖీ చేస్తున్న పోలీసులు

సుజాతనగర్: సుజాతనగర్‌లో ఎస్‌ఐ సోమేశ్వర్ ఆధ్వర్యంలో సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో విస్తృతంగా వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. రూ.50 వేల కంటే అదనంగా నగదు తీసుకెళ్లే వారు అందుకు తగిన ఆధారాలు చూపించాల్సి ఉంటుందన్నారు. ప్రజలు ఎన్నికల నిబంధనలు పాటించాలని, అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎన్నికల బరిలో కొత్త పార్టీలు

కొత్తగూడెంఅర్బన్: గెలిచిన నాయకులు, ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, యువతకు మాత్రమే దేశ రాజకీయాలను మార్చే సత్తా ఉందనే మహనీయుల స్ఫూర్తిదాయక నినాదాలను ఆదర్శంగా తీసుకొని 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పలు నూతన పార్టీలు బరిలో నిలవనున్నాయి. ఇప్పటికే ఆయా పార్టీల రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకొని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అభ్యర్థులను సైతం ప్రకటించి ఎన్నికల ప్రచారానికి సిద్ధం అవుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎన్నికల్లో బరిలో ఉండబోతున్న పార్టీలలో ఆబాద్ పార్టీ పేరుతో హసన్ షేక్ వ్యవస్థాపకుడిగా కొత్త పార్టీని ఏర్పాటు చేశారు. జిల్లాలో ఎమ్మెల్యే కూడా అభ్యర్థులను ప్రకటించనున్నారు. పార్టీకి సీసీ కెమెరా గుర్తును ఎన్నికల సంఘం కేటాయించింది. ఇది ఇలా ఉంటే విద్యార్థుల రాజకీయ పార్టీ మరొకటి నూతనంగా తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటయింది. ఇప్పటికే రాష్ట్రంలో 115 నియోజకవర్గాలలో అభ్యర్థులతో తొలి జాబితాను విడుదల చేశారు. ఎన్నికల సంఘం ఈ పార్టీకి క్రికెట్ బ్యాట్ గుర్తు కేటాయించింది. ప్రస్తుతం నూతనంగా ఏర్పడిన పార్టీలు, ఇప్పటికే ఉన్న పార్టీలు ఎన్నికల ప్రచారం చేస్తుండడంతో నియోజకవర్గాలలో ఎన్నికల వాతావరణం సంతరించుకుంది.

ఫిజియోథెరపీ క్యాంపు సందర్శన



ఫిజియోథెరపీ శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా కోఆర్డినేటర్ సైదులు

జూలూరుపాడు: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని దివ్యాంగుల ఫిజియోథెరపీ శిబిరాన్ని సోమవారం విద్యాశాఖ జిల్లా కోఆర్డినేటర్ ఎస్కే సైదులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులను ప్రతి సోమవారం ఫిజియోథెరపీ శిబిరానికి తీసుకొస్తున్నారా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. మాట్లాడుతూ.. సర్టిఫికెట్ లేని దివ్యాంగుల కోసం జిల్లాస్థాయిలో క్యాంపులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సదరమ్ క్యాంపునకు హాజరయ్యే ప్రత్యేక అవసరాల గల పిల్లలు మీసేవా కేంద్రాల్లో స్లాట్ బుకింగ్ చేసుకోవాలని చెప్పారు. దివ్యాంగ పిల్లల కోసం ప్రతి సోమవారం నిర్వహించే ఫిజియోథెరపీ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ జ్యోతి, ఐఈఆర్‌పీలు, దివ్యాంగులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గుండెపోటుతో బీఆర్ఎస్ నేత మృతి

ఇల్లెందురూరల్: సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ కోఆప్షన్ సభ్యుడు, బీఆర్ఎస్ నాయకుడు శీలం సురేష్ (48) సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ, హరిసింగ్ నాయక్ దంపతులు వచ్చి ఆయన భౌతిక కాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, వివిధ రాజకీయ పక్షాల నాయకులు సురేష్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సింగిల్ రోడ్‌లో సీఎం సభ

ట్రాఫిక్ ఇబ్బందులు తప్పవు

- ఎక్కడి వాహనాలు అక్కడే
- పెద్ద వాహనాలు ఊరి బయటే



ఇల్లెందు మండలం మొట్లగూడెం వద్ద సిద్ధమవుతున్న సీఎం సభా వేదిక

ఇల్లెందు: బీఆర్ఎస్ ఎన్నికల ఆశీర్వాద సభను మండలంలో కొత్తగూడెం రోడ్‌లో మొట్లగూడెం వద్ద నిర్వహిస్తుండటంతో ట్రాఫిక్ పరేషాన్ తప్పని పరిస్థితి నెలకొంది. నవంబర్ 1న ఇల్లెందులో సీఎం కేసీఆర్ ఎన్నికల ఆశీర్వాద సభకు హాజరుకానున్నారు. ఈ సభకు సుమారు 75 వేల మంది ప్రజలను తరలించాలని నాయకులు నిర్ణయించారు. అయితే ఊరి బయట ఇల్లెందు – కొత్తగూడెం రోడ్‌లో మొట్లగూడెం వద్ద సభ వేదికను నిర్ణయించారు. ఇల్లెందు – కొత్తగూడెం వైపుకు వెళ్లే ఏకైక మార్గంలో ఈ సభ నిర్వహిస్తుండటంతో ట్రాఫిక్ తీవ్ర అంతరాయం ఏర్పడే ప్రమాద ఉంది. సీఎం సభా వేదిక, దాని పక్కనే వాహనాల పార్కింగ్, దాని పక్కనే హెలీప్యాడ్ ఏర్పాటు చేస్తున్నారు. అయితే సభాస్థలిలోకి వెళ్లే మార్గం మినహాయిస్తే ఇతర అన్ని ప్రాంతాలను పోలీసులు మూసి వేయనున్నారు. దీంతో ఇల్లెందు– కొత్తగూడెం వెళ్లే సాధారణ ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురుకానున్నాయి. ఒకే మార్గం గుండా సీఎం సభకు వచ్చే వాహనాలు, అదే మార్గం గుండా ఇల్లెందు – కొత్తగూడెం వెళ్లే వాహనాలు తిరుగాల్సి ఉంది. దీంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది.

ట్రాఫిక్ మళ్లింపు ఇలా...

సీఎం సభ సందర్భంగా బుధవారం సుమారు 75 వేల మందిని సభా వేదిక వద్దకు తరలించే ఏర్పాట్లలో బీఆర్ఎస్ నాయకులు ఉండగా అదే సమయంలో సాధారణ ప్రయాణికులు ఈ మార్గం గుండా ప్రయాణించేందుకు ఆంక్షలు కూడా ఉంటాయి. మహబూబాబాద్ రోడ్ గుండా వచ్చే బీఆర్ఎస్ వాహనాలు బైపాస్ రోడ్ గుండా సభా వేదిక వద్దకు చేరుకుంటాయి. ఇక గుండాల రోడ్ గుండా వచ్చే వాహనాలు సత్యనారాయణపురం గుండా హనుమంతులపాడ్ రోడ్ గుండా సభాస్థలి వద్దకు చేరుకుంటాయి. కొత్తగూడెం రోడ్ గుండా వచ్చే వాహనాలు బొజ్జాయిగూడెం స్టేజీ వద్ద పార్కింగ్ ప్రదేశంలో నిలిపి నడుచుకుంటూ గ్రౌండ్ వద్దకు చేరుకుంటారు. ఖమ్మం రోడ్ గుండా తరలివచ్చే వాహనాలు లలితాపురం వద్ద నుంచి గ్రౌండ్ వద్దకు చేరుకుంటాయి. అయితే సభా వేదిక వద్ద పార్కింగ్ ప్రదేశం తక్కువ ఉండటంతో ఏటు వైపు నుంచి వచ్చే వాహనాలు అటు వైపే నిలిపివేయనున్నారు. సభా వేదికకు ఒకేమార్గం ఉండటంతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం అయ్యే అవకాలు ఎక్కువగా ఉన్నాయి.

భారీగా పోలీసుల మోహరింపు...

సీఎం సభ సందర్భంగా పెద్ద ఎత్తున పోలీసులను మోహరింప జేస్తున్నారు. ఎస్పీ డాక్టర్ జి.వినీత్ ఆధ్వర్యంలో ఏఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలతో పాటు హోంగార్డు వరకు సీఎం సభ బందోబస్తులో పాల్గొంటారు. వీరితో పాటు అటవీశాఖ, సింగరేణి సిబ్బంది కూడా పోలీసులకు సహకరించనున్నారు. ఇల్లెందులో జరగనున్న సీఎం బహిరంగ సభను విజయవంతం చేసేందుకు అధికార పార్టీ ముందుకు సాగుతోంది. కానీ ఈ తరుణంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించటం కష్టతరంగా మారుతుందని ప్రయాణికులు అంటున్నారు.

ట్రాఫిక్ మళ్లించే అవకాశం..

సీఎం సభ దృష్ట్యా ట్రాఫిక్‌ను మళ్లించే అవకాశం కనిపిస్తోంది. పెద్ద వాహనాలను సభా సమయంలో నిలిపి వేసి దారి మళ్లించే అవకాశం ఉందని పోలీసు అధికారులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అత్యవసరం అయితే గుండాల రోడ్‌లో మర్రిగూడెం – బోడు – టేకులపల్లి మీదుగా కొత్తగూడెం వైపు వెళ్లేవారు ఉపయోగించుకోవచ్చని చెబుతున్నారు. ఈ విషయమై డీఎస్పీ ఎస్వీ రమణమూర్తి దృష్టికి తీసుకు రాగా... కొత్తగూడెం రోడ్‌లో బొజ్జాయిగూడెం, ఖమ్మం – మహబూబాబాద్ రోడ్ గుండా వచ్చే వాహనాలు గ్రౌండ్ పక్కనే ఏర్పాటు చేసే పార్కింగ్ స్థలం వరకు అనుమతిస్తామని తెలిపారు. ఇక ఒకే రోడ్‌లో రాకపోకలకు అంతరాయం కలగకుండా పెద్ద వాహనాలకు అనుమతించబోమన్నారు. మీటింగ్ ముగిసి సభకు వచ్చిన వాహనాలు వెళ్లిపోయిన తర్వాత ట్రాఫిక్ క్లియర్ చేయనున్నట్లు తెలిపారు.



సీఎం సభా వేదిక వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పాల్వంచ: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకులు నిమ్మల రాంబాబు అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రైతుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ.. ప్రతి పంచాయతీ పరిధిలో రైతుల కోసం ప్రభుత్వం గిడ్డంగి ఏర్పాటు చేయాలని, రైతుల నుంచి పంటలను ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలన్నారు. దళారులను అరికట్టాలని, పేద రైతులందరికీ పంటల బీమా వర్తింపజేయాలని, వర్షాభావ పరిస్థితులు అనుకూలించక పూత, కాత దశలో ఎండిపోయిన పంటలను పరిశీలించి, నష్టపరిహారం అందించాలన్నారు. రైతులకు నెలకు రూ.10వేల పెన్షన్ అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, సురేశ్, తులసీ, అర్జున్, చుక్కారావు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనను ప్రశ్నించండి..



హాజరైన పట్టణ కమిటీ, బూత్ కమిటీ సభ్యులు




మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య

ఇల్లెందు: కాంగ్రెస్ పార్టీ అమలు చేయనున్న సంక్షేమ పథకాలను ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని, గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని కొనసాగించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అవినీతి పాలనను ఎలుగెత్తి చాటాలని జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య అన్నారు. సోమవారం ఇల్లెందులోని జేకే కాలనీలో పట్టణ కాంగ్రెస్ ఆత్మీయ సమ్మేళనం సభలో ఆయన మాట్లాడారు. గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహిస్తూ కాంగ్రెస్ ప్రవేశపెట్టనున్న పథకాలను ప్రచారం చేస్తూ ప్రజల ఆశీర్వాదం పొందాలన్నారు. కాంగ్రెస్‌ను అధికారంలోకి రాగానే ఆడబిడ్డలకు రూ.500 వంట గ్యాస్ సిలిండర్ అందజేస్తుందన్నారు. నిరుపేదలకు ఆరోగ్యశ్రీ ద్వారా రూ.5 లక్షల ఉచిత వైద్యం అందిస్తుందని చెప్పారు. సొంతింటి కల నెరవేర్చేందుకు రూ.5 లక్షలతో ఇందిరమ్మ ఇల్లు కట్టిస్తుందన్నారు. ఇంట్లో ఇద్దరు వృద్ధులు ఉంటే ఇద్దరికీ పింఛన్ పథకం వర్తింపజేస్తుందన్నారు. కాంగ్రెస్ సంక్షేమ పాలనలోనే ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందుతాయని తెలిపారు.

కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ మండల అధ్యక్షుడు డి.డానియేల్, మాజీ చైర్మన్ యదళ్లపల్లి అనసూర్య, కౌన్సిలర్ పత్తి స్వప్న, జాఫర్, శ్రీనివాస్, జీవీ భద్రం, లింగాల జగన్నాథం, శంకర్, మహబూబ్, సైదుమియా, మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, చిల్లా శ్రీనివాస్, బోగ నందకిషోర్, చెంచమ్మ, వెంకటనారాయణ, నీలపు రమేష్, హరినాథ్‌బాబు, సుదర్శన్ కోరీ, దుర్గా, సతీష్, సువర్ణ, వెంకటలక్ష్మి, నిర్మల, స్వరూప, మదారమ్మ, సరస్వతి, సునీత, సరోజ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ ఐక్యవేదిక నాయకులను ఆదరించాలి



మాట్లాడుతున్న రాజేష్‌నాయక్

కొత్తగూడెంటౌన్: రానున్న అసెంబ్లీ ఎన్నికల బరిలో తమ సత్తా చాటుతామని, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను ఓడిస్తామని ఎస్టీ సంఘాల ఐక్య వేదిక నాయకులు తుడందెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు రాజేష్‌నాయక్ అన్నారు. సోమవారం జిల్లా కొత్తగూడెం క్లబ్‌లో జరిగిన ఎస్టీ సంఘాల ఐక్య వేదిక సమావేశంలో వారు మాట్లాడారు. రాజ్యాంగ బద్ధంగా రాజ్యాధికారం చేపట్టాలని ఆదివాసీ ఉద్యమ సంఘాలు 12 ఎస్టీ రిజర్వుడు స్థానాల్లో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఉద్యమంగా పోరాడాలని నిర్ణయంగా తీసుకున్నట్లు తెలిపారు. తుడందెబ్బ గోండ్వానా సంక్షేమ పరిషత్, నాయకపోడు సేవా సంఘం, నాయక్ పోడుదెబ్బ, నంగారా బేరీ హక్కుల పోరాట సమితి, ఎరుకల హక్కుల పోరాట సమితి ఇతర సంఘాలతో పాటు ఎస్టీ సంఘాల ఐక్య వేదిక మద్దతు ఎస్టీ రిజర్వు స్థానాలైన 12 అసెంబ్లీ స్థానాల్లో ఆదివాసీ హక్కుల కోసం, మనుగడ కోసం, రక్షణ కోసం ఆదివాసీ అభ్యర్థులను పోటీలో నిలబెడుతున్నట్లు వారిని గెలిపించాలని పిలుపునిచ్చారు. 12 ఎస్టీ రిజర్వుడ్ అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసి సత్తా చాటుతామని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఆదివాసీలు పోరాడి సాధించుకున్న 5వ షెడ్యూల్డ్‌లో ఉన్న హక్కులు, చట్టాలు, 1/70 యాక్ట్ చట్టాలు, పెసా చట్టం, అటవీ హక్కుల గుర్తింపు చట్టం, ఏజెన్సీలో 100 శాతం ఉద్యోగాలు రిజర్వేషన్ల అమలు, సంస్కృతి సంప్రదాయాలను కాపాడటం కోసం జీఓ నంబర్ 3 స్థానంలో చట్టం రూపొందించాలని ఆదివాసులు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. 12 అసెంబ్లీ స్థానాల్లో ఎస్టీ స్థానాల్లో ఇల్లెందు నుంచి తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య, మహబూబాద్ నుంచి తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్, భద్రాచలం నుంచి గోండ్వానా సంక్షేమ పరిషత్ అధ్యక్షుడు పాయం సత్యనారాయణ, కొత్తగూడెం నుంచి తుడుందెబ్బ రాష్ట్ర నాయకుడు కొమరం బుచ్చయ్య, పినపాక నుంచి తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు వర్ల శ్రీనివాస్, వైరా నుంచి నంగారా బేరీ ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భద్రునాయక్ పోటీలో ఉన్నారని వీరితో పాటు మరో 6 స్థానాల్లో పోటీలో ఉన్నట్లు చెప్పారు. సమావేశంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణానాయక్, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మోహన్‌నాయక్, భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు కేశవ్‌నాయక్, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు దశరథ్‌నాయక్, తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పూనం శ్రీనివాస్, కార్యదర్శి వీరభద్రం, రవీందర్ నాయక్ పాల్గొన్నారు.

నేడే చివరి అవకాశం

టేకులపల్లి: ఓటు హక్కు కోసం నమోదు చేసుకునేందుకు అక్టోబర్ 31 చివరి తేదీ అని టేకులపల్లి తహసీల్దార్ కొండపల్లి కృష్ణవేణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 1వ తేదీ వరకు 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మండలంలో ఇప్పటి వరకు 38,602 మంది ఓటర్లు ఉన్నారని, వీరిలో పురుషులు 19,281, మహిళలు 19,321 మంది ఉన్నట్లు తెలిపారు.

అధికారులకు శిక్షణ

ఇల్లెందు: అసెంబ్లీ ఎన్నికల పీఓ, ఏపీఓలకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం సుదిమళ్ల గిరిజన బాలికల గురుకుల కళాశాలలో నిర్వహించారు. సోమవారం నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి 219 మంది పీఓలు, ఏపీఓలు హాజరు కావాల్సి ఉండగా 190 మంది హాజరయ్యారు. వీరికి మాస్టర్ ట్రైనర్స్ ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.

సివిల్స్ శిక్షణలో అన్యాయం

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్‌లో యూపీఎస్సీ, సీ-సాట్-2024 పరీక్షకు దరఖాస్తులు చేసుకున్న వారిలో అర్హులైన మైనార్టీ అభ్యర్థులందరికీ సివిల్స్‌లో ఉచిత శిక్షణను అందించాలని జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఎండీ.యాకూబ్‌పాషా సోమవారం ఒక పకటనలో డిమాండ్ చేశారు. ఈ ఏడాది ఆగస్టులో రాష్ట్ర వ్యాప్తంగా వందమంది మైనార్టీలకు సివిల్స్‌లో ఉచిత శిక్షణ అందిస్తామని పేర్కొన్న అధికారులు, 50 మంది జాబితాను రూపొందించారని పేర్కొన్నారు. రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ తీసుకున్న ఈ నిర్ణయంపై మైనార్టీ అభ్యర్థులు నిరుత్సాహానికి గురవుతున్నారని తెలిపారు. మైనార్టీ సంక్షేమ శాఖ నోటిఫికేషన్‌లో ప్రకటించిన విధంగా రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న వంద మందికి అవకాశం కల్పించాలని, ఈ విషయంలో రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి చొరవ చూపాలని విన్నవించారు.

ప్రలోభాలకు గురికావొద్దు..

జూలూరుపాడు: ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై సోమవారం రాత్రి ఎస్‌ఐ బి.పురుషోత్తం ఆధ్వర్యంలో జూలూరుపాడులో ప్రజలకు అవగాహనా సదస్సు నిర్వహించారు. మాట్లాడుతూ ఓటర్లు ప్రలోభాలకు లోనుకాకుండా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీసులకు సహకరించాలన్నారు.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం కార్పొరేట్ పరిధిలోని సింగరేణి ఉద్యోగులకు సోమవారం కేసీఓఏ క్లబ్‌లో జాతీయ సైబర్ సెక్యూరిటీ అంశంపై కార్పొరేట్ ఐడీ, హెచ్‌ఆర్‌డీ విభాగం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. జీఎం ఐటీ రామ్‌కుమార్, డీజీఎం శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ... సింగరేణి కోల్ ఇండస్ట్రీలో సైబర్ మోసాలను అరికట్టేందుకు మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్‌మేషన్ టెక్నాలజీ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఈ ఏడాది అక్టోబర్‌ను జాతీయ సైబర్ సెక్యూరిటీ అవగాహన నెలగా పరిగణించే కార్యక్రమంలో భాగంగా సింగరేణి ఉద్యోగులకు సైబర్ సెక్యూరిటీపై అవగాహన కల్పించటం జరుగుతుందన్నారు. ఆర్థిక లావాదేవీలపై ముఖ్యమైన సమాచారాన్ని కాపాడుకోవాలని సంస్థకు, వ్యక్తిగతంగా నష్టం వాటిల్లకుండా జాగ్రత్త పడాలని సూచించారు.

ఆదరించండి.. అభివృద్ధి చేస్తా..



ఇంటింటి ప్రచారం చేస్తున్న హరిప్రియ, చైర్మన్ డీవీ

ఇల్లెందు: ఐదేళ్లుగా నియోజకవర్గ అభివృద్ధి కోసం పాటుపడిన తనను మరోమారు ఆదరించాలని, మరింత అభివృద్ధి చేస్తానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బానోతు హరిప్రియ అన్నారు. సోమవారం పట్టణంలోని పలు వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించి ఓటు అభ్యర్థించారు. సంక్షేమం, అభివృద్ధిలో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని, ఇల్లెందు రూపురేఖలు మార్చినట్లు తెలిపారు. ఇల్లెందు మున్సిపాల్టీని అన్నిరంగాల్లో దేశంలో అగ్రస్థానంలో నిలిపినట్లు చెప్పారు. ఇంటింటికీ సీఎం కేసీఆర్ పథకాలు చేరాయని, రానున్న కాలంలో మరిన్ని పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తామన్నారు. రూ.కోట్ల నిధులు వెచ్చించి పట్టణంలో ప్రతీ వార్డులో సీసీ రోడ్లు, మంచినీటి పైపులైన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజామోదంతో అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్ ప్రతీ ఇంటికి అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందేలా పాలన సాగించాడని గుర్తు చేశారు. దివ్యాంగుల విధి పాలిట వంచితులైతే సీఎం కేసీఆర్ పెద్ద కొడుకులా రూ.4 వేలు పింఛన్ ఇచ్చి ఆదుకున్నారని తెలిపారు. 24 గంటల విద్యుత్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనన్నారు. ఎన్నికలప్పుడు వచ్చి కల్లబొల్లి మాటలు చెప్పే వారిని నమ్మవద్దన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ సయ్యద్ జానీపాషా, గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగల రాజేందర్, ఎస్.రంగనాథ్, కౌన్సిలర్లు వారా రవి, కటకం పద్మావతి, అంకెపాక నవీన్, వాంకుడోతు తార నాదేండ్ల శ్రీనివాసరెడ్డి, మనోహర్ తివారీ, పరుచూరి వెంకటేశ్వర్లు, ధనమ్మ, మేకల శ్యాం తదితరులు ఉన్నారు.

కూనంనేనిని అంసెబ్లీకి పంపించాలి



మాట్లాడుతున్న ముత్యాల విశ్వనాథం

పాల్వంచ: ప్రజల గొంతుక సీపీఐ నుంచి కొత్తగూడెం ఎమ్మెల్యే అభ్యర్థి కూనంనేని సాంబశివరావును అసెంబ్లీకి పంపించాలని పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల విశ్వనాథం అన్నారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో మండల, పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశం మండల సహాయ కార్యదర్శి గుండాల నాగరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వనాథం మాట్లాడుతూ.. పదేళ్ల కాలంలో రాష్ట్రంలో విచ్చలవిడి పాలన సాగిందన్నారు. పేదల పక్షాన గొంతు విప్పే నాయకుడే కరువయ్యారన్నారు. కుర్చీని పదిలం చేసుకునేందుకు ఇబ్బడిముబ్బడిగా సంక్షేమ పథకాల పేరుతో మేనిఫెస్టో విడుదల చేశారని, గడిచిన రెండుసార్లు సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం చతికిలపడిందన్నారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌ను ఇంటికి పంపించాలన్నారు. దళిత బంధు పేరుతో దళిత వర్గాలను మోసం చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, బండి నాగేశ్వరరావు, గుండాల నాగరాజు, దుగ్గిరాల సుధాకర్, అన్నారపు వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, నరహరి నాగేశ్వరరావు, బొమ్మెన సత్యనారాయణ, జకరయ్య, పాషా, కృష్ణమూర్తి, హేమలత తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తాం..



మాట్లాడుతున్న బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

పాల్వంచ: ఎన్నికల కోడ్ అమలులో ఉండగా కొత్తగూడెం నియోజకవర్గంలో కొందరు స్థానిక అధికారులు అధికార పార్టీకి సహకరిస్తున్నారని వారిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయనున్నామని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు, ఐసీఏఆర్ బోర్డు మెంబర్ బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గృహం వద్ద ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికార పార్టీకి చెందిన నేతలు లిక్కర్‌ను వార్డుల వారీగా డంప్ చేస్తున్నారన్నారు. బెల్ట్ షాపుల్లో భారీ ఎత్తున అమ్మకాలు చేస్తున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోక పోవడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రచారం చేస్తున్న అధికార అభ్యర్థి ప్రతీరోజు రూ.లక్షలు ఖర్చు పెడుతుంటే కట్టడి చేయాల్సిన అధికారులు సహకరిస్తున్నారని ఆరోపించారు. భారీ ఎత్తున గ్రామ పంచాయతీల్లో డబ్బుల పంపిణీ జరుగుతోందన్నారు. వీటిపై అధికారులు సీరియస్‌గా చర్యలు తీసుకోవడం లేదని, వారిపై రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామన్నారు. సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి పోనిశెట్టి వెంకటేశ్వర్లు, గంధం ప్రసాద్‌గౌడ్, మాలోతు ప్రశాంత్ నాయక్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

విప్లవ పార్టీల అభ్యర్థులను గెలిపించండి



మాట్లాడుతున్న సాధినేని వెంకటేశ్వరరావు

ఇల్లెందు: ఎన్నికలను ఎత్తుగడగా, ప్రజా సమస్యలను ప్రధాన ఎజెండాగా, పాలకుల మోసాలను బట్టబయలు చేస్తూ ఈ ఎన్నికల్లో రెండు ఎన్డీ పార్టీలు కలిసికట్టుగా ఒకే అభ్యర్థిని రంగంలోకి దింపుతున్నాయని, ప్రజలు బూర్జువా పాలకవర్గ పార్టీలను ఓడిస్తూ విప్లవ కమ్యూనిస్టు పార్టీల అభ్యర్థులను గెలిపించాలని ఎన్డీ రాష్ట్ర నాయకులు వి.కోటేశ్వరరావు, సాధినేని వెంకటేశ్వరరావు కోరారు. సోమవారం పట్టణంలోని ఎన్డీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దేశంలో మోదీ రాష్ట్రంలో కేసీఆర్ ఫాసిస్టు పాలన సాగిస్తున్నారని విమర్శించారు. పదేళ్ల కాలంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయటంలో విఫలమయ్యారని తెలిపారు. కల్లబొల్లి మాటలతో మూడోసారి ప్రజలను మోసం చేసి అధికారం దక్కించుకోవాలని ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. అత్యంత ప్రమాదకర పరిస్థితులలో దేశం మనుగడ సాగిస్తోందని, ఈ తరుణంలో ప్రజా గొంతుకగా న్యూడెమోక్రసీ నిలుస్తోందని తెలిపారు.

నాలుగు విప్లవ పార్టీల మధ్య ఐక్యత చర్చలు సాగుతున్నాయని తెలిపారు. ఇందులో భాగంగా రెండు పార్టీలు చర్చించుకుని ఉమ్మడి అభ్యర్థులను రంగంలోకి దింపుతున్నట్లు తెలిపారు. ఇల్లెందు అసెంబ్లీ స్థానం నుంచి ఆరుసార్లు గెలిచి ప్రజలకు సుపరిపాలన అందించామని, అదే తరహా పాలన అందించేందుకు తమ అభ్యర్థులు పాటుపడుతారని తెలిపారు. ఇల్లెందు, పినపాక ఎన్డీ అభ్యర్థులు మోకాళ్ల కృష్ణ (మాణిక్యారం సర్పంచ్), ఈసం కృష్ణ (గుండాల మాజీ ఎంపీపీ)లను పోటీలో నిలుపుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎన్డీ నేతలు ఆవునూరి మధు, గౌని ఐలయ్య, జడ సీతారామయ్య, ముక్తి సత్యం, బండారి ఐలయ్య, మండల వెంకన్న, మోకాళ్ల మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ వారోత్సవాలు ప్రారంభం



ప్రతిజ్ఞ చేస్తున్న సింగరేణి అధికారులు, ఉద్యోగులు

సింగరేణి(కొత్తగూడెం): సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ ఆదేశాల మేరకు సింగరేణి ప్రధాన కార్యాలయంలో సోమవారం విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను సింగరేణి డైరెక్టర్ ఈఅండ్‌ఎం డి.సత్యనారాయణరావు ప్రారంభించారు. విశిష్ట అతిథిగా హాజరైన డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) పి.వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. సింగరేణి సీఅండ్‌ఎండీ ఎన్.శ్రీధర్ ఆదేశాల మేరకు ఈనెల 30 నుంచి నవంబర్ 5వ తేదీ వరకు సింగరేణి వ్యాప్తంగా గనులు, డిపార్ట్‌మెంట్లలో అవగాహన వారోత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా ఈరోజు సింగరేణి ప్రధాన కార్యాలయంలో నిర్వహించినట్లు చెప్పారు. అవినీతిని తిరస్కరించండి.. దేశం పట్ల నిబద్ధత కలిగి ఉండండి.. అనే నినాదం ఈ సంవత్సరం విజిలెన్స్ అవగాహన వారోత్సవాల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈరోజు నిర్వహించే కార్యక్రమానికి ముందు మూడు నెలల నుంచి ముందస్తు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా ప్రజాప్రయోజనాల వెల్లడి, సమాచారం ఇచ్చే వారి రక్షణపై సింగరేణి వ్యాప్తంగా అవగాహన కల్పించటం జరిగిందన్నారు. సింగరేణి ఉద్యోగులందరూ నిబంధనల మేరకు పనిచేస్తూ తమ విధులను నిజాయితీగా నిర్వహిస్తూ సంస్థలోని ఉద్యోగులు తమ చుట్టుపక్కల జరిగే అవినీతిపై ఉదాసీన వైఖరి చూపకుండా, సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చి అరికట్టే విధంగా సంస్థకు సహకరించాలని కోరారు. ప్రతి ఉద్యోగి పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించుకొని అవినీతి రహిత సమాజాన్ని నిర్మించుకోవాలని, ఉద్యోగులు తమ కోరికలను నియంత్రించడం ద్వారా అవినీతిని దూరంగా ఉంచాలని సూచించారు. అవినీతి వలన జరిగే దుష్ప్రభావాల గురించి పౌరులకు అవగాహన కల్పించాలని, దీని ద్వారా సమాజం మెరుగుపడి ఉత్తమ ఫలితాలు వస్తాయని ఇదే ఈ విజిలెన్స్ అవగాహన వారోత్సవాల ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ఈ అవగాహన కార్యక్రమాల ద్వారా సంస్థలోని ఉద్యోగులందరూ వ్యక్తిగతంగా ప్రతీఒక్కరు చైతన్యవంతులై అవినీతిని నిర్మూలించడానికి తమవంతు సహాయ సహకారాన్ని అందించాలని కోరారు. అనంతరం అడిషినల్ మేనేజర్ విజిలెన్స్ జి.రాజేందర్‌రెడ్డి ఉద్యోగులతో సమగ్రతా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జీఎం సీపీపీ జక్కం రమేష్, జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కట్టా బసవయ్య, జీఎం విజిలెన్స్ (ఈఅండ్‌ఎం) ప్రసాదరావు, జీఎం (ఐటీ) జి.రామ్‌కుమార్, కార్పొరేట్‌లోని వివిధ విభాగాల జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.